పక్కా స్కెచ్

- వుడా భూమిని కొట్టేయడానికి ఓ ప్రజాప్రతినిధి పథకం
- షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఏర్పాట్లు
- స్థానికుల ఫిర్యాదుతో అధికారుల పరిశీలన
- నిర్మాణాలు చేపడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరిక



సిద్ధం చేసిన శిలాఫలకం



దుకాణ సముదాయం నిర్మిస్తామని చెప్పిన స్థలంలో మంతనాలు జరుపుతున్న స్థానిక కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు



షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తామన్న వుడా స్థలాన్ని పరిశీలిస్తున్న జెడ్సీ సింహాచలం, ఏసీపీ అరుణవల్లి

పెదగంట్యాడ: ప్రభుత్వ స్థలంపై కన్నేసిన ఓ ప్రజాప్రతినిధి దానిపై ఆదాయం పొందేందుకు పక్కా స్కెచ్ వేశాడు. ఎవరికీ అనుమానం రాకుండా, అధికారికంగా వుడా స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించేందుకు రంగం సిద్ధం చేశాడు. తద్వారా వచ్చే ఆదాయాన్ని పదేళ్ల పాటు తన జేబులో నింపుకొనేందుకు పక్కాగా పథకం రచించాడు.. రాత్రికి రాత్రే తన పథకాన్ని పక్కాగా అమలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాడు. దీని కోసం శిలా ఫలకాన్ని కూడా రెడీ చేశాడు.. అయితే, ఆ ప్రజాప్రతినిధి పన్నాగం తెలియడంతో ఆ ప్రాంతవాసులు స్పందించారు. వెంటనే కలెక్టర్ మల్లికార్జునకు, జీవీఎంసీ కమిషనర్ రాజాబాబుకు ఫిర్యాదు చేశారు.. స్పందించిన ఉన్నతాధికారులు ఆ స్థలాన్ని పరిశీలించి, ఎటువంటి నిర్మాణాలు చేపట్టకుండా అడ్డుకోవాలని ఆదేశించారు.

వివరాలివి..

జీవీఎంసీ 76వ వార్డు గాంధీనగర్ ప్రాంతంలో నూకాంబిక అమ్మవారి ఆలయం వెనుక, గెడ్డను ఆనుకొని వుడాకు చెందిన స్థలం ఉంది. ఈ స్థలం గతంలో ఖాళీగా ఉండడంతో స్థానికులు కొంతమంది అక్కడ చిన్న చిన్న దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. ఆయా దుకాణాల యజమానులు ఆలయ కమిటీకి ప్రతి నెలా అద్దె రూపంలో రూ.1000 నుంచి రూ.2వేల వరకు చెల్లిస్తున్నారు. ఆ అద్దె డబ్బులతోనే ఆలయాన్ని నిర్వహిస్తున్నారు.

రోడ్డు పక్కనే ఈ స్థలం ఉండడం.. ఇటీవల ఈ ప్రాంతంలో దుకాణాలు పెరగడంతో డిమాండ్ ఏర్పడింది.. దీంతో ఈ స్థలంపై ఓ ప్రజాప్రతినిధి కన్ను పడింది. అక్కడ ఉన్న చిన్న చిన్న దుకాణాలను తొలగించి.. పక్కాగా దుకాణ సముదాయాన్ని నిర్మించాలని నిర్ణయించుకున్నాడు. అనుకున్నదే తడవుగా ఆలయ కమిటీ ప్రతినిధులతో భేటీ అయి, వారిని ఎలాగో ఒప్పించాడు.. ఇక్కడ పది దుకాణాలు నిర్మిద్దామని, ఒక్కో దుకాణానికి రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షల వరకు అడ్వాన్సు కింద తీసుకుందామని, నెలకు ఒక్కో దుకాణానికి రూ.6వేల వంతున అద్దె వసూలు చేద్దామని చెప్పడంతో ఆలయ కమిటీ సభ్యులు కూడా సై అన్నారు.

ఇందులోనే మతలబు..

అడ్వాన్సుల కింద తీసుకున్న సొమ్ముతో పాటు తాను మరికొంత సొమ్మును జత చేసి దుకాణాలు నిర్మిస్తానని, అయితే ప్రతి నెలా అద్దె రూపంలో వచ్చే ఆదాయాన్ని పదేళ్ల పాటు తాను తీసుకుంటానని చెప్పి ఆలయ కమిటీ ప్రతినిధులను ఒప్పించాడు. దీనికి సంబంధించి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకుంటానని చెప్పాడు. తర్వాత అక్కడే తిష్ట వేసి, అధికారికంగా ఆ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించేందుకు ముహూర్తం ఫిక్స్ చేశాడు. ఎమ్మెల్యే చేతుల మీదుగా ఈ నెల 10న ఉదయం 11 గంటల సమయంలో దీనిని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసుకున్నాడు.

బెడిసికొట్టిన వ్యూహం

అంతా సవ్యంగా, అనుకున్నది అనుకున్నట్లుగా జరిగిపోతుండడంతో ఎమ్మెల్యే చేతుల మీదుగా భూమి పూజ చేయడానికి గొయ్యి తవ్వించాడు.. అలాగే శిలా ఫలకాన్ని సిద్ధం చేశాడు. అయితే ఆ ప్రజాప్రతినిధి వ్యూహం బెడిసికొట్టింది. ఈ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంపై స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జీవీఎంసీ జోనల్ కమిషనర్ సింహాచలం, టౌన్ ప్లానింగ్ ఏసీపీ అరుణవల్లి శుక్రవారం మధ్యాహ్నం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడ ఎటువంటి నిర్మాణాలు చేపట్టవద్దని హెచ్చరించారు. గుడి వెనుక నిల్వ ఉంచిన మట్టి, రాళ్లను జేసీబీ సాయంతో లారీల్లో లోడు చేసి తరలించారు.

కార్పొరేటర్ అన్నీ తానై..

స్థానిక తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు అన్నీ తానై నడిపిస్తున్నారని స్థానిక దుకాణదారులు బహిరంగంగానే చెబుతున్నారు. దుకాణాలు కావాల్సిన వారు అడ్వాన్సులు ఇవ్వాలని, ప్రతి నెలా రూ.6వేలు అద్దె చెల్లించాలని కోరుతున్నారని తెలిపారు. చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటున్నామని, ఒక్కసారిగా అడ్వాన్సులు ఇవ్వలేమని, ఆరు వేల అద్దె కట్టలేమని లబోదిబోమంటున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తాం

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తామని చెప్పిన స్థలాన్ని పరిశీలించాం. అక్కడ ఎటువంటి నిర్మాణాలు చేపట్టవద్దని హెచ్చరించాం. ఈ స్థలమైతే ప్రభుత్వానిదే. దీనిపై రెండు రోజుల్లో ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తాం. ఉన్నతాధికారుల ఆదేశానుసారం చర్యలు చేపడతాం.

– పొందూరు సింహాచలం, జోనల్ కమిషనర్, జీవీఎంసీ జోన్–6

ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు బాలచెరువులోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. స్వామికి విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. స్వామిని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, నాయకులు గొందేశి వెంకటరమణారెడ్డి, జీలకర్ర భువనేశ్వరి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి 87వ వార్డు సమస్యలు



ఎమ్మెల్యే నాగిరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డులో నెలకొన్న ప్రజా సమస్యలను వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై వినతిపత్రం సమర్పించారు. గాంధీబొమ్మ సెంటర్ నుంచి వడ్లపూడి వరకు రోడ్డు పాడైనందున త్వరితగతిన నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే నాగిరెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ప్రగడ వేణుబాబు, భూపతిరాజు శ్రీనివాసరాజు, ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు, బొండా గోవిందరాజు, కృష్ణంరాజు, ప్రగడ రాము తదితరులున్నారు.

క్లుప్తంగా

పేదలకు చీరల పంపిణీ



మహిళకు చీర అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులు

పెదగంట్యాడ: ఉత్తరాంధ్ర గౌతు లచ్చన్న గీత కులాల యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఏకుల వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో పేదలకు శుక్రవారం చీరలు పంపిణీ చేశారు. స్థానిక వినాయకనగర్ వుడా కాలనీలో బ్రదర్ అనిల్‌కుమార్ జన్మదినోత్సవాన్ని నిర్వహించారు. ఈ వేడుకల్లో గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పాల్గొని కేక్ కట్ చేసి, పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్టుపూడి పరదేశి, జెర్రిపోతుల గోవిందరావు, నెల్లి సాధూరావు, గొందేశి వెంకటరమణారెడ్డి, దేవాడ వరమహేశ్వరరెడ్డి, రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళకు జిగ్‌జాగ్ మిషన్ అందజేత



మహిళకు జిగ్‌జాగ్ మిషన్, సరకులు అందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి పెదమడకకు చెందిన సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ నిరుపేద మహిళకు జిగ్‌జాగ్ కుట్టుమిషన్, నిత్యావసర సరకులను అందించింది. లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ ఎం.ఉషారాజు చేతుల మీదుగా వీటిని అందించారు. ఉషారాజు ట్రస్ట్ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు జి.పూర్ణానందశర్మ, జానకీదేవి, ట్రస్ట్ వ్యవస్థాపకులు గుదే సుశీలా గజేంద్రరావు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు పి.సత్యానందం, ఎం.జగదీష్, జి.నరసింగరావు, ట్రస్ట్ గౌరవ సలహాదారు పట్టా రామ అప్పారావు, ప్రతినిధులు పాల్గొన్నారు.

గృహసారథులు, కన్వీనర్లకు శిక్షణ నేడు

అగనంపూడి: జీవీఎంసీ 79, 85 వార్డుల్లోని సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథుల మండల స్థాయి శిక్షణ కార్యక్రమం అగనంపూడిలోని రాజీవ్‌గాంధీ మున్సిపల్ కల్యాణ మండపంలో శనివారం ఉదయం 8గంటలకు నిర్వహించనున్నట్టు సచివాలయాల మండల కన్వీనర్ వాడపల్లి రామచంద్రరాజు తెలిపారు. స్థానిక అంశాలపై, క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తలు, నాయకులను సమన్వయం చేసుకుంటూ సమర్థవంతమైన నిర్వహణకు దోహదపడేలా శిక్షణ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, 79వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ అప్పికొండ మహాలక్ష్మినాయుడు హాజరవుతారని పేర్కొన్నారు. వార్డు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు విధిగా పాల్గొనాలని కోరారు.

స్టీల్‌ప్లాంట్‌లో ఉత్సాహంగా 'స్వచ్ఛతే సేవ'



కార్యక్రమంలో పాల్గొన్న స్టీల్‌ప్లాంట్ ఉన్నతాధికారులు, ఉద్యోగులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో శుక్రవారం స్వచ్ఛతా హీ సేవా (స్వచ్ఛతే సేవ) కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్) ఇన్‌చార్జి బి.కె. మొహంతి నేతృత్వంలో ఈడీ (వర్క్స్) బిల్డింగ్ వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులు చీపుర్లు పట్టి, బిల్డింగ్ పరిసరాలను శుభ్రం చేశారు. అక్కడ పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు. తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటామని స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేశారు. సీజీఎం మొహంతి మాట్లాడుతూ ఇకపై ప్రతీ నెలా రెండో శుక్రవారం ఈ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీజీఎంలు సారంగి, శ్రీనివాసరావు, ఎస్.వి.స్వామి, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

కార్మికుడి తొలగింపుపై ఆందోళన



ఆందోళన చేస్తున్న సిటూ నాయకులు

అక్కిరెడ్డిపాలెం: సమాన పనికి సమాన వేతనం అడిగిన కార్మికుడిని రైల్వే గూడ్స్ వ్యాగన్ యాజమాన్యం విధుల నుంచి తొలగించడం అన్యాయమని సిటూ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గూడ్ వ్యాగన్ ముందు యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిటూ నాయకుడు రాంబాబు మాట్లాడుతూ ఆటోనగర్‌లోని రైల్వే గూడ్స్ వ్యాగన్‌లో పని చేస్తున్న క్రేన్ ఆపరేటర్ అవతారం స్కిల్డ్ వర్కర్ అయినప్పటికీ, అన్ స్కిల్డ్ వేతనం చెల్లిస్తున్నారని చెప్పారు. దీనిపై యాజమాన్యాన్ని ప్రశ్నించడంతో ఆ కార్మికుడిని విధుల నుంచి తొలగించారన్నారు. ఆ కార్మికుడిని విధుల్లోకి తీసుకొని స్కిల్డ్ వర్కర్ వేతనం చెల్లించాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిటూ ఆటోనగర్ కార్యదర్శి రమణ, జాన్, కార్యదర్శి లోకేష్, తాతారావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు పనుల పరిశీలన



కల్వర్టు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఇమ్రాన్

గాజువాక : జీవీఎంసీ 66వ వార్డులోని ప్రధాన కాలువలపై చేపట్టిన కల్వర్టుల నిర్మాణ పనులు చకచకా సాగుతున్నాయి. వార్డులోని ఇందిరా కాలనీలో నూతన సామాజిక భవనం, అజీమాబాద్, కైలాసనగర్, కణితి రోడ్డు వద్ద ఇటీవల కల్వర్టుల నిర్మాణ పనులను చేపట్టిన విషయం తెలిసిందే. ఈ కల్వర్టులను నిర్మిస్తే ఆయా ప్రాంతాల్లోని ప్రజల రాకపోకలకు సౌకర్యంగా ఉంటుందని కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్ గాజువాక ఎమ్మెల్యే నాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఈ పనులను ప్రారంభించారు. కాగా, వార్డు పర్యటనలో భాగంగా ఆ పనులను ఇమ్రాన్ శుక్రవారం పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలని అధికారులను కోరారు. వార్డు పర్యటనలో నాయకులు పెదిరెడ్ల ఈశ్వరరావు, చిన్నారావు, షేక్ ఆశ, తాడి వరలక్ష్మి, అనసూయ, మనోజ్, లక్ష్మి తదితరులున్నారు.

జూనియర్ కళాశాలలో ప్రయోగశాలలు ప్రారంభం



ల్యాబ్‌లను ప్రారంభిస్తున్న నాట్కో ఫార్మా ఆపరేషన్స్ అధిపతి శ్రీనివాస్ బాబు

గాజువాక : అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భౌతిక, రసాయన శాస్త్ర ప్రయోగశాలలను నాట్కో ఫార్మా ఆపరేషన్స్ అధిపతి కె.వి.శ్రీనివాస్ బాబు శుక్రవారం ప్రారంభించారు. కళాశాలలో ల్యాబ్ అవసరం ఉందన్న విషయాన్ని స్థానిక కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ గతేడాది తమకు తెలిపారని, దీంతో రూ.6.15 లక్షలను వెచ్చించి ఈ ల్యాబ్‌లతో పాటు విద్యార్థులకు అవసరమైన బెంచీలను సమకూర్చామని తెలిపారు. ఈ కళాశాల విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌లో మంచి ర్యాంకులు సాధించడం, జిల్లా స్థాయిలో ఉత్తమ ఉత్తీర్ణతలను నమోదు చేయడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులను ఆయన అభినందించారు. పరీక్షల్లో 950 మార్కులు సాధించిన ప్రతి విద్యార్థికి రూ.10వేల చొప్పున నగదు బహుమతి అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాట్కో ఫార్మా హెచ్ఆర్ సుబ్బరాజు, కళాశాల ప్రిన్సిపాల్ వి.సుశీల్ కుమార్, కళాశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షురాలు బొత్స శశికళ, ఉపాధ్యక్షురాలు ఇందల మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలతో కార్మికుల బేజారు



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న ఆదినారాయణ

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ సంస్థలను అమ్మేస్తూ, కార్మిక వర్గాన్ని అణచివేసే కేంద్రప్రభుత్వ విధానాలతో కార్మికులు ఆవేదన చెందుతున్నారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఐక్య పోరాటాలతో కేంద్రప్రభుత్వ దుశ్చర్యలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 729వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో స్టీల్‌ప్లాంట్‌లోని ఎస్ఎంఎస్–2 విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మంత్రి రాజశేఖర్, ఆదినారాయణ, వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వరంగ పరిశ్రమల్ని సర్వనాశనం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. ఈ ప్రయత్నాలను సంస్థలోని కార్మికులందరూ ఐక్యంగా ఎదుర్కోవాలన్నారు. ప్రజలను భాగస్వాములను చేస్తూ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాణిక్యాలరావు, శంకర్, ఎస్.రాజు, శివ, రమణ, వేణుగోపాలరావు, ఎస్.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

ఉగాది నాటికి గృహ నిర్మాణాలు పూర్తి

సబ్బవరం: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా ఉగాది నాటికి జగనన్న కాలనీల్లో నిర్దేశించిన లక్ష్యం మేరకు గృహ నిర్మాణాలు పూర్తి చేస్తామని గృహ నిర్మాణ శాఖ డీఈ ఏవీవీఎస్ఎన్ రాజు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. అనకాపల్లి జిల్లా పెందుర్తి నియోజకవర్గం పరిధిలోని సబ్బవరం, పరవాడ మండలాల్లో 3,275 గృహాలు మంజూరయ్యాన్నారు. వీటిలో 809 గృహ నిర్మాణాలు పూర్తి కాగా.. ఉగాది నాటికి 1,636 గృహ నిర్మాణాలు పూర్తి చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. సబ్బవరంలో మండలంలో 2,193 గృహాలు మంజూరు కాగా ఇప్పటికే 487 పూర్తికాగా ఉగాది నాటికి 1,071 గృహాలు పూర్తి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

కంచి కామకోటి పీఠాధిపతి రాక రేపు



శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి

గాజువాక: కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామి గాజువాకకు ఆదివారం రానున్నట్లు గాజువాక వర్తక సంఘం, గాజువాక ఆర్య వైశ్య సంఘం నాయకులు తెలిపారు. ఆ రోజు సాయంత్రం ఆరు గంటలకు స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో నిర్వహించనున్న ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొంటారని తెలియజేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



బీసీ రోడ్డును పరిశీలిస్తున్న స్టీల్‌ప్లాంట్ అధికారులు

పెదగంట్యాడ: రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు చర్యలు తీసుకుంటామని స్టీల్‌ప్లాంట్ డీజీఎం కె.బాబునాయక్, టౌన్ అడ్మిన్ అధికారి బోయ్, భద్రతా అధికారి కృష్ణమూర్తి అన్నారు. బీసీ రోడ్డు మార్గంలో ఇటీవల ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నందున చర్యలు చేపట్టాలని ఇంటక్ నాయకులు ఇటీవల భద్రతా అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ నేపథ్యంలో అధికారులు బీసీ రోడ్డుతో పాటు పరిసర ప్రాంతాలను శుక్రవారం పరిశీలించారు. రోడ్డు ప్రమాదాలకు గల కారణాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఇంటక్ వర్కింగ్ ప్రెసిడెంట్ కారు రమణ, నాయకులు గొందేశి ప్రభాకర్‌రెడ్డి, గంగవరం గోపీ, రామిరెడ్డి పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి నిర్మూలనపై అవగాహన



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఉపాధ్యాయులు

కూర్మన్నపాలెం: కుష్ఠు రహిత సమాజ నిర్మాణానికి ప్రతీ ఒక్కరు సహకారం అందించాలని కణితి జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు సూర్యప్రకాశరావు కోరారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా కుష్ఠు వ్యాధిపై శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సరైన సమయంలో వ్యాధిని గుర్తిస్తే నివారణ సాధ్యమేనన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు మానవహారంగా ఏర్పడి కుష్ఠు వ్యాధి నివారణపై ప్రతిజ్ఞ చేశారు. కణితి ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో బాబీ, కొండమ్మ, గోపీ, అమలాంబ, రాణి, నిర్మల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రయాణికుల ఫిర్యాదుతో దుకాణాల తొలగింపు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ నాలుగో నంబర్ ప్లాట్‌ఫాం వైపు ప్రయాణికులకు ఇబ్బందిగా మారిన దుకాణాలను దువ్వాడ రైల్వే అధికారులు తొలగించారు. స్టేషన్ ముఖ ద్వారం ఎదురుగా బస్టాప్ వద్ద ప్రయాణికులు వేచి ఉండే ప్రదేశంలో కొంతకాలంగా టీ దుకాణాలు, కూరగాయలు, ఇతర దుకాణాలు నిర్వహిస్తున్నారు. దీనిపై ప్రయాణికులు రైల్వే అధికారులకు ఫిర్యాదు చేయడంతో, స్పందించిన అధికారులు శుక్రవారం వాటిని తొలగించారు.

65వ వార్డు సమస్యలపై మేయర్‌కు వినతి



మేయర్ హరి వెంకటకుమారికి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ నర్సింహపాత్రుడు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఆ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు కోరారు. ఈ మేరకు నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ రాజాబాబుకు శుక్రవారం వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకతీయ ఆర్చి నుంచి వాంబే కాలనీకి వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని విన్నవించారు. 20 బ్లాకులతో కూడిన వాంబే కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, పూర్తి స్థాయిలో డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన మేయర్, కమిషనర్ ఆ ప్రాంతంలో పర్యటిస్తామని హామీ ఇచ్చారు.

'అదానీ ఆస్తులు జప్తు చేయాలి'



పెదగంట్యాడ పోస్టాఫీసు ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

పెదగంట్యాడ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని సీపీఐ గాజువాక సమితి నాయకులు ఎల్లేటి శ్రీనివాసరావు, తాండ్ర కనకరాజు, జి.ఆనంద్ ఆరోపించారు. అదానీ ఆస్తులను జప్తు చేయాలని కోరుతూ పెదగంట్యాడ పోస్టాఫీస్ ఎదుట శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం చేశారన్నారు. రైల్వే జోన్, పోలవరం ప్రాజెక్టులకు నిధులు కేటాయించకుండా కాలయాపన చేస్తున్నారని ధ్వజమెత్తారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, నిర్వాసితులకు శాశ్వత ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం పోస్ట్‌మాస్టర్ జి.సూర్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కె.అచ్యుతరావు, అప్పారావు, విష్ణుమూర్తి, పోతన్న, దుర్గారావు, సోమేష్ పాల్గొన్నారు.

467మందికి కంటి పరీక్షలు



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎన్టీపీసీ సీజీఎం సంజయ్‌కుమార్, కార్పొరేటర్ సూర్యకుమారి

పెదగంట్యాడ: జీవీఎంసీ 77వ వార్డు పరిధి పిట్టవానిపాలెంలో శుక్రవారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఎన్టీపీసీ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరాన్ని ఎన్టీపీసీ సీజీఎం సంజయ్‌కుమార్ సైనా, 77వ వార్డు కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి ప్రారంభించారు. శిబిరంలో 467 మందికి వైద్యులు కంటి వైద్య పరీక్షలు చేశారు. వారిలో 101 మందికి మందులు అందజేశారు. 339 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించారు. వారికి ఈ నెల 17న కళ్లద్దాలు పంపిణీ చేయనున్నారు. 11 మందికి శస్త్ర చికిత్సలు అవసరం కావడంతో, వారిని ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో ఏజీఎం రుమా, ప్రకాష్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బి.హెచ్.పి.వి. ఉద్యోగస్తుల గృహ నిర్మాణ సహకార సంఘం (వీకర్ సెక్షన్ & మైనారిటీ గ్రూప్స్), బి.నెం.1882 విశాఖపట్నం

సభ్యులకు విజ్ఞప్తి

బి.హెచ్.పి.వి. ఉద్యోగస్తుల గృహ నిర్మాణ సహకార సంఘం (వీకర్ సెక్షన్ & మైనారిటీ గ్రూప్స్) బి.నెం.1882 విశాఖపట్నం యొక్క పాలకవర్గ ఎన్నికలు తేది.07-03-2023న జరుగును. ఇందు నిమిత్తం సంఘ బైలా నిబంధనలు ప్రకారం ఒక సంఘంలోనే సభ్యత్వం కలిగివుండవలెను. కానీ కొంతమంది సభ్యులు బి.హెచ్.పి.వి. ఉద్యోగస్తుల గృహ నిర్మాణ సహకార సంఘం బి.నెం.1445 విశాఖపట్నం నందు కూడా సభ్యత్వం కలిగివున్నందున వారి సభ్యత్వము ఓటర్స్ జాబితా నుండి మరియు సంఘ సభ్యత్వము తొలగించబడునని ఇందుమూలంగా తెలియపరచడమైనది. మరియు మీ అభ్యంతరములను వ్రాతపూర్వకముగా **తేది. 13-02-2023** నాటికి బి.హెచ్.పి.వి. ఉద్యోగస్తుల త్రిఫ్ట్ కోఆపరేటివ్ సొసైటీ నందు ఈ దిగువ సంతకందారునికి తెలియపరచవలెను.

(కె.ఎస్.వి.జి. ప్రసాద్) సహాయక రిజిస్ట్రార్ / అఫిషియల్ పర్సన్‌ఇన్‌ఛార్జ్
బి.హెచ్.పి.వి. ఉద్యోగస్తుల గృహ నిర్మాణ సహకార సంఘం,
(వీకర్ సెక్షన్ & మైనారిటీ గ్రూప్స్), విశాఖపట్నం